# యువత నినాదం

## రేస్ కార్ల సృష్టికర్తలు






## వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి యంత్ర విద్యార్థుల ప్రతిభ

న్యూస్‌టుడే, నిజాంపేట

బుల్లి తెర మీద కార్ల పోటీలను చూసి మనం సరదా పడుతుంటాం... గంటకు 100 నుంచి 120 కిలోమీటర్లకు పైగా వేగంతో నడిచే కార్ల పోటీలను వీక్షించడానికి, పాల్గొనడానికి యువత మక్కువ చూపుతుంటారు. బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి యంత్ర విద్య(ఇంజినీరింగ్) కళాశాలకు చెందిన 29 మంది విద్యార్థులు తమ మేధా సంపత్తితో రెండు రేస్ కార్లను స్వయంగా తయారుచేశారు. వాటిని జపాన్‌లోని కాకేగవా, ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ, జాతీయ ప్రదర్శనల్లో ఉంచి ప్రశంసలు పొందారు.

కళాశాలలోని మెకానికల్, ఆటోమొబైల్ విభాగాల్లో ద్వితీయ, తృతీయ, చివరి సంవత్సరం విద్యార్థులు రెండు బృందాలుగా ఏర్పడ్డారు. అందులో 14 మందితో కూడిన బృందానికి ఎస్.ధరణి, 15 మంది బృందానికి అజయ్ నేతృత్వం వహించారు. అంతా రెండున్నర నెలలు శ్రమించి రెండు రేస్ కార్లను తయారుచేశారు. వాటికి 'వీఎఫ్ఓ 3ఏ, సుప్ర-ఎస్ఏఈ'గా పేర్లు పెట్టారు. వీఎఫ్ఓ కారు తయారీలో హోండా సీబీఆర్ 600 సీసీ ఇంజిన్‌ను వినియోగించారు. టైర్లను హాంకాంగ్ నుంచి తెప్పించారు. మిగతా విడిభాగాలను సొంతంగా తయారుచేసి అమర్చారు. దీని తయారీకి రూ.4 లక్షల వ్యయం అయ్యిందని జట్టు ప్రతినిధి తెలిపారు. సుప్ర కారు తయారీకి మారుతీ సంస్థ 800 సీసీ ఇంజిన్‌ను ఉచితంగా అందించింది. ఎంఆర్ఎఫ్ టైర్లను కొని మిగతా పరికరాలు సొంతంగా తయారుచేశారు. దీనికి రూ.2.5 లక్షల ఖర్చు అయ్యిందని జట్టు ప్రతినిధి అజయ్ పేర్కొన్నారు.

### జపాన్‌లో ప్రశంస

జపాన్‌లోని కాకేగవా నగరంలో గతేడాది సెప్టెంబరు 3 నుంచి 7వ తేదీ వరకు జరిగిన 'ఎస్ఏఈ-2012 రేసింగ్' పోటీల్లో వీఎఫ్ఓ 3ఏ కారును ప్రదర్శించారు. ఈ పోటీల్లో మన దేశం నుంచి ఈ ఒక్క కారే పాల్గొనడం విశేషం. 8 రకాల ప్రదర్శనల్లో ఈ బృందం చూపిన ప్రతిభకు నిర్వాహకులు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. 'సుప్ర- ఎస్ఏఈ' రేసింగ్ కారును గతేడాది సెప్టెంబరు 6 నుంచి 9 వరకు ఢిల్లీలో జరిగిన బుద్ధ ఇంటర్నేషనల్ సర్క్యూట్(ఎఫ్1 రేసింగ్) పోటీల్లో ప్రదర్శించారు.

- వీఎఫ్ఓ 3ఏ కారు తయారీ బృందం: ఎస్.ధరణి, వినయ్, అవినాష్, అభిషేక్, సంజయ్, యశ్వంత్, ముకుల్, వికాస్, రాకేష్, మేఘన, సౌమ్య, సాయికిరణ్, శ్రీకర్, చంద్రకిరణ్.
- సుప్ర-ఎస్ఏఈ బృందం: అజయ్, సూర్య, అఖిలేష్, హర్ష, అమర్, డి.హర్ష, అశోక్, విజయ్, ఆదిత్య, సుశాంత్, రాణి, సాహితి, సచిన్, శ్రీచరణ్, శ్రావణ్.